సాక్షి
ప్రకాశం
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



పశువులకు పెద్దకష్టం
మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌ల సేవల కాలపరిమితి గత బుధవారంతో ముగిసినా వాటిని కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వలేదు.
- 8లో..



అగ్నికి ఆహుతై మహిళ మృతి
అనుమానాస్పద స్థితిలో అగ్నికి ఆహుతై మహిళ మృతిచెందిన సంఘటన పామూరు మండలం వగ్గంపల్లెలో జరిగింది.
- 8లో..

గరిష్టం/కనిష్టం
33/23

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నలుగురు వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు

గిద్దలూరు (బేస్తవారిపేట): గిద్దలూరు మండలంలోని నలుగురు వీఆర్వోలకు శనివారం రెవెన్యూ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించలేదు. సమస్యను పరిష్కరించినట్లు రికార్డుల్లో చూపించారు. ఈ విషయం కలెక్టర్‌కు తెలియడంతో సంజీవరాయునిపేట, నరవ పంచాయతీ, వెల్లుపల్లి పంచాయతీ, గడికోట పంచాయతీ వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కొండకి నిప్పు.. ఎగసిపడుతున్న మంటలు



నల్లమల అటవీ ప్రాంతంలో ఎగసిపడుతున్న మంటలు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానానికి వెళ్లే మార్గంతో పాటు అంబవరం నుంచి రంగస్వామి ఆలయానికి వెళ్లే మార్గాల్లో నల్లమల అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు కొండకి నిప్పు పెట్టడంతో అటవీ ప్రాంతంలో దట్టమైన పొగ, భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా అటవీ ప్రాంతంలో గడ్డి ఎండిపోవడంతో కారుచిచ్చు రగిలిపోతోంది. ఈ విషయంపై ఫారెస్టు డీఆర్‌వో నాయక్‌కు వివరణ కోరగా అంబవరం గ్రామం నుంచి అటవీ ప్రాంతానికి వెళ్లే మార్గంలో గుర్తుతెలియని గొర్రెల కాపరులు నిప్పు పెట్టి ఉంటారని తెలిపారు. అటవీ ప్రాంతంలో ఎగసిపడుతున్న మంటలను ఆర్పేందుకు 15 మంది ఫారెస్టు సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు.

ఆశలు కల్పించి.. బతుకులు కూల్చి!

కాంట్రాక్టు లెక్చరర్ల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోంది. ఎన్నికల ముందు వీరి సర్వీసులను క్రమబద్ధీకరణ చేసి, అధికారంలోకి వచ్చాక మేము మేనిఫెస్టోలో పెట్టలేదు కదా..మీ సర్వీసు క్రమబద్ధీకరణ చేసే ప్రసక్తే లేదంటూ విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ స్పష్టం చేస్తుండడంతో కాంట్రాక్టు లెక్చరర్ల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల ముందు ఒకలా..అధికారంలోకి వచ్చాక మరోలా వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు వాపోతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో కాంట్రాక్ట్ లెక్చరర్లు 267 మంది
- జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల సంఖ్య 44
- వీరి సర్వీసులు క్రమబద్ధీకరించేందుకు జగన్ సర్కార్ చర్యలు
- అడుగడుగునా అడ్డుపుల్లలు వేసిన టీడీపీ నేతలు
- 114 జీఓపై కోర్టుకెళ్లి అడ్డుకున్న వైనం
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకుని..
- ఎన్నికల్లో హామీలిచ్చి..అధికారంలోకి వచ్చాక మాటమార్చేసి..



ఒంగోలు సిటీ:

‘‘కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును క్రమబద్ధీకరించి, వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకుంటా’’ అంటూ..గత ఏడాది ఏప్రిల్ 28వ తేదీన కోడుమూరు నియోజకవర్గం గూడూరులో నిర్వహించిన ఎన్నికల సభలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వ పెద్దలు నాలుక మడతెట్టేశారు. కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసు క్రమబద్ధీకరణ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టలేదు.. మిమ్మల్ని రెగ్యులర్ చేయడంకాదని విద్యాశాఖ మంత్రి స్పష్టం చేయడంతో కాంట్రాక్టు లెక్చరర్లు అవాక్కయ్యారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న మా భవిష్యత్ గందరగోళంగా మారిందని కాంట్రాక్టు లెక్చరర్లు ఆందోళన చెందుతున్నారు.

ప్రశ్నార్థకంగా 267 మంది జీవితాలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కాంట్రాక్ట్ లెక్చరర్లు 267 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు 44 ఉన్నాయి. వీటిలో 32 జూనియర్ కళాశాలలు, 8 డిగ్రీ కళాశాలలు, 4 పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లు 230 మంది, డిగ్రీ కాలేజీల్లో 22 మంది, పాలిటెక్నిక్ కళాశాలలో 15 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పని చేస్తున్నారు. వీరందరూ 2 వేల సంవత్సరంలో విధుల్లో చేరారు. అప్పటి నుంచి నేటి వరకు సర్వీస్ రెగ్యులరైజేషన్ కోసం పోరాడుతూనే ఉన్నారు.

114 జీఓను అడ్డుకున్న టీడీపీ

అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట తప్పకుండా వీరందరినీ రెగ్యులరైజ్ చేస్తానని 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా జీవో నెంబర్ 114 విడుదల చేసి రెగ్యులరైజ్ చేసేందుకు యత్నించారు. కానీ అంతలోనే తెలుగుదేశం నాయకులు కన్నుకుట్టి కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు.

అడుగడుగునా అడ్డుపుల్లలు..

గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించటాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు ఎన్నికలకు ముందు ఈసీకి ఫిర్యాదు చేయడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. అధికారంలోకి వచ్చాక వారిని రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. కాంట్రాక్టు ఉద్యోగులపై గత ప్రభుత్వాలు వివిధ కమిటీలు, మంత్రివర్గ ఉప సంఘాలను నియమించినా వారి కల సాకారం కాలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వారి సమస్యలపై చర్చించి 30/23 చట్టం తెచ్చింది. ఆ తర్వాత 114 జీఓను సైతం విడుదల జేసింది. దీంతో వైద్య, అటవీ, గిరిజన సంక్షేమ శాఖల్లో పనిచేస్తున్న వారు రెగ్యులర్ అయ్యారు. మిగిలిన వారికి సంబంధించి సంకేతిక సమస్యలు తలెత్తడంతో వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఇది అమలైతే జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ మంచిపేరు వస్తుందోనని టీడీపీ నేతలు కుట్రలకు తెరతీశారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి జగన్ సర్కార్ తీసుకున్న చర్యలను అడ్డుకున్నారు. ఫలితంగా వారి భవిష్యత్ అగమ్యంగా తయారైంది.

జీతాలు పెంచిన జగన్..

కాంట్రాక్టు లెక్చరర్లుగా విధుల్లో చేరినప్పుడు వీరి జీతం రూ.4 వేలు. ఆ తర్వాత క్రమంగా రూ.27 వేలకు పెరిగింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019– 24 మధ్య జూనియర్ కాలేజీలో పనిచేసే కాంట్రాక్ట్ లెక్చరర్లకు రూ.27 వేల నుంచి రూ.57 వేల వరకు, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లోని పనిచేసే వారికి రూ.30 వేల నుంచి రూ.64 వేల వరకు పెంచారు.

అధికారంలోకి వచ్చాక మాట మార్చేసి..

2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార సభలో కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ హామీలు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక మాటమార్చేశారు కూటమి ప్రభుత్వ పెద్దలు. తమ సర్వీసులు రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. అయితే ఈ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టలేదు, అది మేము అమలు చేయలేమని ఖరాఖండిగా చెప్పేశారు. దీంతో వారు అవాక్కయ్యారు. కూటమి ప్రభుత్వం తీరుపై వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం పరిధిలో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 88 డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నవంబర్-2024లో నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ మొత్తం 6807 మంది విద్యార్థులకు గాను 6019 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఇందులో 2780 మంది విద్యార్థులు 46.19 శాతం మేరకు ఉత్తీర్ణత సాధించారన్నారు. బీఏ హానర్స్ విభాగంలో మొత్తం 321 మందికి గాను 141 మంది, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో 2253 మందికి గాను 1106 మంది, బీకాం జనరల్ విభాగంలో 79 మందికి గాను 25 మంది, బి.ఒకేషనల్ విభాగంలో 31 మందికి 4, బీఎస్సీ హానర్స్ విభాగంలో 2498 మందికి గాను 1033 మంది, బీబీఏ విభాగంలో 66 మందికి గాను 35 మంది, బీసీఏ విభాగంలో 771 మందికి గాను 436 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ పరీక్ష ఫలితాలను యూనివర్శిటీ రిజల్ట్స్ లింకు ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

గ్రూప్ 2 అభ్యర్థులతో కూటమి చెలగాటం

- ఉదయం నుంచి వాయిదా వేస్తున్నారని పచ్చ మీడియాలో ఊకదంపుడు వార్తలు
- అన్ని ఏర్పాట్లు చేశారు కనుక వాయిదా వేయలేమన్న కోర్టు
- విస్మయం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు
- ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందంటూ మండిపాటు



ఒంగోలు సిటీ: రెండు రోజులు నుంచి గ్రూప్-2 అభ్యర్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటోంది. రోస్టర్ విధానంపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రూపు-2 అభ్యర్థుల్లో సందిగ్ధత నెలకొంది. కానీ విటన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించకుండా పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. కానీ ఈ రెండు రోజులుగా కూటమి ప్రభుత్వం అభ్యర్థులతో దాగుడు మూతలు ఆడుతూ తప్పుదోవ పట్టించింది.

7 కేంద్రాల్లో 4,544 మంది అభ్యర్థులు..

జిల్లాలో ఒంగోలు, నగర శివారు ప్రాంతాల్లోని 7 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు 4,544 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాలైన క్విస్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 944 మంది, శ్రీనాగార్జున డిగ్రీ కళాశాలలో 600 మంది, శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల, పీజీ కళాశాలలో 600 మంది, రైస్ కాలేజీలో రెండు కేంద్రాల్లో 1200 మంది, పేస్ కళాశాలలో రెండు కేంద్రాల్లో 1200 మంది అభ్యర్థులను కేటాయించారు. పరీక్షల నిర్వహణకు కోఆర్డినేటింగ్ అధికారిగా జేసీ గోపాలకృష్ణ రోణంకి ఉన్నారు. 7 పరీక్ష కేంద్రాలకు 7 మంది జిల్లాస్థాయి లైజన్ అధికారులను నియమించారు. పేపరు-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పేపరు-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం గం.5.30 వరకు జరుగుతాయి. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వేటినీ పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ఆయా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. దివ్యాంగులు, గర్భిణులు గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులందరూ హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక ఫొటో గుర్తింపు కార్డు తీసుకు రావాలి. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేయడం కోసం కలెక్టరేట్ లో 8801188046 నంబరుతో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు.

మేము రాయడానికి సిద్ధంగా లేము.. కానీ తప్పనిసరి

నోటిఫికేషన్ లో రోస్టర్ తప్పులు ఉన్నాయని.. రోస్టర్ మార్చి ఇస్తారని ఎదురుచూస్తూ కొన్ని రోజులుగా మేమందరం చదవకుండా ఉన్నాం. కానీ ప్రభుత్వం రోస్టర్‌లో మార్పులు చేయకుండానే చివరికి పరీక్ష పెడుతోంది. మేము ఇప్పుడు పరీక్ష రాయడానికి సిద్ధంగా లేము అయినా తప్పనిసరి పరిస్థితుల్లో హాజరు కావాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం, ఏపీపీఎస్సీ నిరుద్యోగులతో ఏరకంగా ఆడుకుంటున్నారో గమనిస్తూనే ఉన్నాం. నిరుద్యోగుల్ని మానసిక వేదనకు గురి చేశారు. మీరు మాకు ఉద్యోగం ఇస్తున్నట్లు లేదు మా జీవితాలను నాశనం చేసినట్లు ఉంది.

– సాల్మన్, గ్రూప్ 2 అభ్యర్థి

గ్రూప్ 2 అభ్యర్థులకు న్యాయం చేస్తామని మాట మార్చారు

రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలతో గ్రూప్ 2 అభ్యర్థులు ఎవరూ సరిగా పరీక్షకు సిద్ధమవలేదు. వాయిదా పడుతుందా లేదా అనే సందిగ్ధంలో అభ్యర్థులున్నారు. న్యాయ నిపుణులతో కూటమి ప్రభుత్వం చర్చిస్తామనడంతో అభ్యర్థులు గందర గోళ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రూప్ 2 పరీక్ష వాయిదా పడుతుందని భావించి అభ్యర్థులు హైదరాబాదు వంటి ప్రాంతాల్లోనే ఉన్నారు. తెల్లవారితే పరీక్ష అనడంతో సెంటర్లకు చేరుకోలేని పరిస్థితుల్లో ఆందోళన చెందుతున్నారు.

– ఫ్రాన్సిస్, గ్రూప్ 2 అభ్యర్థి

భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపాలి

- రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా, కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు సిటీ: భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపాలని, చట్టానికి ఎవరూ అతీతం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా స్పష్టం చేశారు. ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేసు లతో కలిసి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రీసర్వే, ఆర్‌ఓఆర్ కేసులు, రెవెన్యూ సదస్సులు, గ్రీవెన్స్ కార్యక్రమాల్లో వచ్చిన రెవెన్యూ సంబంధిత అర్జీలను పరిష్కరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయా విషయాలను జాయింట్ కలెక్టరు వివరించారు. ఈ సందర్భంగా ఆర్పీ.సిసోడియా మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రతిష్ట కోల్పోయేలా ఎవరైనా ప్రవర్తిస్తే సహించబోనన్నారు. ముఖ్యంగా గ్రీవెన్సు కార్యక్రమాల్లో వస్తున్న అర్జీల్లో 60 శాతం వరకూ రెవెన్యూ సంబంధిత సమస్యలనే ప్రజలు ప్రస్తావిస్తున్నారని, పరిష్కరించదగిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సహేతుకంగా పరిష్కరించడం ద్వారా అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. కేవలం వీఆర్వో నివేదిక పైనే ఆధారపడకుండా ఆర్ఐ లు నిత్యం ఫీల్డ్ లో ఉండేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సర్వే శాఖలో తగినంత సిబ్బంది ఉన్నందున విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించనన్నారు. ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న 120 డ్రోన్ ల ద్వారా రీసర్వే, జాయింట్ ఎల్‌పీఎం ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రైవేటు భూ యజమానులను 22(ఎ) జాబితాలో చేర్చడం ద్వారా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఇలాంటి భూముల కేసులను జిల్లా స్థాయి కమిటీలో చర్చించాలన్నారు. కోర్టు కేసులు, లోక్ అదాలత్ కేసులను పర్యవేక్షిస్తూ సత్వరమే పరిష్కారమయ్యేలా అవసరమైన పిటీషన్లు సమర్పించాలన్నారు.

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను మార్చి మొదటి వారం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ ఏ.బాలాంజనేయులు, సర్వేశాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషా, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

అనంతరం ఒంగోలు నగర శివారులోని అగ్రహారం గ్రామంలో గతంలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల లే అవుట్ ని ఆర్పీ సిసోడియా పరిశీలించారు. దీనికి సంబంధించిన వివరాలను జాయింట్ కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా వారి వెంట హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వాసు, ఇతర అధికారులు ఉన్నారు.

భూ అక్రమాలపై ఆరా...

ఒంగోలు, పరిసర ప్రాంతాల్లో నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులు, ఫోర్జరీ సంతకాలతో రెండేళ్ల క్రితం వెలుగుచూసిన భూ అక్రమాలపై సిసోడియా ఆరా తీశారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏ.ఆర్.దామోదర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ అక్రమాలపై ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పడినందున ఎన్ని కేసులు నమోదయ్యాయి, వాటి దర్యాప్తు పురోగతి, చార్జి షీటు దాఖలు, తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులకు సంబంధించిన స్థలాలు, వ్యవసాయ భూములపై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, ఇతర పత్రాలను పరిశీలించి వాటికి సంబంధించిన వాస్తవ యజమానులను, డాక్యుమెంట్లను గుర్తించాలన్నారు. స్థలాలకు ఫేక్ డాక్యుమెంట్స్ ఎవరు సృష్టించారో ఆధారాలు సేకరించాలని ఆదేశించారు. సిట్ పరిధిలోకి రాని కేసులను తొలగించాలని, మిగతా కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. దీనిపై కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ 15 రోజుల్లోగా సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ ఏ.బాలాంజనేయులు, ఆర్డీవో లక్ష్మి ప్రసన్న, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, పలువురు సీఐలు, ఒంగోలు తహశీల్దారు వాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘మహా శివరాత్రి’కి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- 25 నుంచి శ్రీశైలానికి ఆటోలు, ద్విచక్ర వాహనాలకు అనుమతులు నిల్
- భారీ వాహనాలు కుంట, గిద్దలూరు, నంద్యాల మీదుగా వెళ్లాలని ఆదేశాలు
- పర్వదినానికి 200 మంది పోలీసు సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు
- డీఎస్పీ నాగరాజు




పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ నాగరాజు తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ట్రాఫిక్ తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వచ్చి, పోయే వాహనాల సంఖ్య అధికంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, దీంతో పాటు ఘాట్ రోడ్లలో ప్రమాదాలను నివారించే లక్ష్యంతో శ్రీశైలం రహదారిని 10 సెక్టార్లు విభజించినట్లు చెప్పారు. ఒక్కో సెక్టార్‌లో మొబైల్ టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. ఏదైనా ట్రాఫిక్ జాం అయితే అక్కడికక్కడే రెస్క్యూ చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఘాట్ రోడ్డులో ఏదైనా వాహనం బ్రేక్ డౌన్ అయినప్పుడు మూడు క్రేన్లు, ఐదుగురు మెకానిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు 25, 26 తేదీల్లో ఘాట్ రోడ్లలోకి ఆటోలు, ద్విచక్ర వాహనాలలో ప్రయాణాన్ని నిషేధిస్తున్నట్లు ఆయన తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ద్విచక్రవాహనాలు ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణాన్ని రద్దు చేసుకోవాలని సూచించారు. 25వ తేదీ నుంచి శ్రీశైలం వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు దోర్నాలలో నిలిపివేస్తామని, ఆయా వాహనాలకు పార్కింగ్‌కు సంబంధించి శ్రీశైలం రహదారిలోని మల్లికార్జున ఎస్టేట్ వద్ద పార్కింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాగాలంకరణ సమయంలో శ్రీశైలంలో ఏర్పడే ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని 26 వ తేదీ రాత్రి 10 నుంచి 27వ తేదీ ఉదయం 5 గంటల వరకు ఆర్టీసీ బస్సులతో సహా ఎటువంటి వాహనాలను శ్రీశైలానికి అనుమతించబోమని తెలిపారు. దీంతో పాటు భారీ వాహనాలను 25వ తేదీ నుంచి ట్రాఫిక్‌ను మరల్చి కుంట, దేవరాజుగట్టు, గిద్దలూరు, నంద్యాల వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. నలుగురు సీఐలు, తొమ్మిది మంది ఎస్సైలతో మొత్తం 200 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. 25వ తేదీ రాత్రి నుండే భద్రతా చర్యలు ఉంటాయన్నారు. ఆరు జీపులు, నాలుగు బైక్స్‌తో మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ సిబ్బందితో కలిసి భద్రత ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.



అటవీ ప్రాంతంలో కాలినడకన వెళ్తున్న మల్లన్న భక్తులు



శ్రీశైలం వెళ్లేందుకు గణపతి చెక్‌పోస్ట్ వద్ద బారులు తీరిన వాహనాలు

శ్రీశైలానికి భారీగా తరలి వెళ్తున్న భక్తులు

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు భారీగా శ్రీశైలం తరలి వెళ్తున్నారు. దీంతో శ్రీశైలం వెళ్లే యాత్రికులు, భక్తులతో మండల కేంద్రంలో రద్దీ వాతావరణం నెలకొంది. పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకుని అటవీశాఖ శ్రీశైలం ఘాట్‌రోడ్డులో రాత్రి వేళ ప్రయాణాలకు అనుమతిచ్చింది. దీంతో 24వ తేదీ రాత్రి నుంచి 28వ తేదీ రాత్రి వరకు రాత్రి వేళల్లో పుణ్యక్షేత్రానికి నిరంతరం ప్రయాణించేందుకు అటవీశాఖ అనుమతులు ఉన్నాయని ఫారెస్టు రేంజి అధికారి జీవన్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఎక్కువ శాతం భక్తులు కాలి నడకన నల్లమల అటవీ ప్రాంతం గుండా పుణ్య క్షేత్రానికి చేరుకుంటున్నారు.

క్లుప్తంగా

భూ కుంభకోణం కేసులో ఇద్దరి అరెస్టు

ఒంగోలు టౌన్ : ఒంగోలు నగరంలో భూముల కబ్జాలకు సంబంధించి గత ప్రభుత్వ హయాం లో సిట్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో శనివారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిట్ స్పెషల్ ఆఫీసర్ సుధాకరరావు తెలిపారు. టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చెంది ప్రస్తుతం ఒంగోలు నగరంలోని గోపాల్‌నగర్‌లో నివసిస్తున్న ముంతా సుబ్రహ్మణ్యం, నగరంలోని లాయరు పేటకు చెందిన చీతిరాల పూర్ణచంద్రరావును లాయరు పేట సాయిబాబా గుడి వద్ద అరెస్టు చేసినట్లు వెల్లడించారు. యజమాని మరణించినా, దీర్ఘ కాలంగా ఊరిలో లేకపోయినా.. అలాంటి వారి భూములను ఎంపిక చేసుకుని నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించినట్లు వీరిపై ఆరోపణలు ఉన్నట్లు సుధాకరరావు తెలిపారు.

పెద్దనల్లకాల్వలో భారీ కొండచిలువ


గడ్డిలో నుంచి వెళ్తున్న కొండచిలువ

కంభం: మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామంలో శుక్రవారం రాత్రి సుమారు 13 అడుగుల పొడవైన భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. రాత్రి 11.30 గంటల సమయంలో గడ్డివాముల సమీపంలో కొండచిలువ కనిపించడంతో ఫారెస్టు అధికారులకు రైతులు సమాచారం అందించారు. కొండచిలువ సొప్పకుప్పల్లోకి దూరిపోవడంతో అక్కడికి వచ్చిన ఫారెస్టు సిబ్బందికి దాన్ని పట్టుకోవడానికి కుదరలేదు. దీంతో శనివారం రాత్రి మరోసారి వచ్చి పట్టుకునేందుకు ప్రయత్నిస్తామని ఫారెస్టు సిబ్బంది చెప్పినట్లు స్థానికులు తెలిపారు. కొండచిలువ తిరుగుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పశువులకు పెద్ద కష్టం

- మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌ల ద్వారా వైద్య సేవలకు ముగిసిన కాలపరిమితి
- 2022లో ప్రవేశపెట్టిన ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కొనసాగించేందుకు చర్యలు చేపట్టని కూటమి ప్రభుత్వం
- అర్ధంతరంగా నిలిచిపోయిన వాహనాలు, వైద్యసేవలు
- పశువుల వద్దకే వచ్చి వైద్యం చేయడం ఇక లేనట్లే..
- ప్రస్తుతం కూటమి సర్కార్ నిలిపివేయడంతో ఆందోళనలో పశుపోషకులు
- ఉపాధి కోల్పోయామని ఆవేదన చెందుతున్న అంబులెన్స్‌ల ఉద్యోగులు


గడ్డి కోసం పొలాల వెంట తిరుగుతున్న గేదెలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజల సంక్షేమంతో పాటు పశువుల గురించి కూడా పెద్ద మనసుతో ఆలోచించారు ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పశువుల వద్దకే పశువైద్యులు, సిబ్బంది వచ్చి మెరుగైన చికిత్స చేసేందుకు మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. పశుపోషకులు ఫోన్ చేసిన వెంటనే అంబులెన్స్‌తో వైద్యసిబ్బంది వచ్చి పశువులకు అక్కడే చికిత్స చేయడంతో పాటు నాణ్యమైన మందులు కూడా అందించి వెళ్లేవారు. అనారోగ్యానికి గురై నడవలేకున్న పశువులను ఎంతో కష్టపడి వాహనాల్లో ఎక్కించి పశువైద్యశాలలకు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా చూసేవారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను నిలిపివేసింది. మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌ల వైద్య సేవలకు కాల పరిమితి గత బుధవారంతో ముగిసినప్పటికీ.. వాటిని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టకుండా పశువులు, వాటి పోషకులను అష్టకష్టాలకు గురిచేసేలా వ్యవహరిస్తోంది.

\- మార్కాపురం

నా పేరు గాలయ్య. మా ఊరు జమ్మనపల్లి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నా గేదెకు కాలు విరిగింది. వైద్యం చేస్తారా.? అంటూ మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ కోసం ఆనాటి ప్రభుత్వం సూచించిన 1962 నంబర్‌కు ఫోన్ చేశాను. మార్కాపురంలో ఉన్న మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ తీసుకుని వైద్యసిబ్బంది వచ్చారు. గేదెకు ఆపరేషన్ చేయాల్సి రావడంతో ఆ వాహనంలోనే వెటర్నరీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆపరేషన్ చేసిన తర్వాత తిరిగి ఇంటి వద్ద కూడా దించారు. ఆపరేషన్ అవసరం లేని వైద్యమైతే ఇంటి వద్దే చేసి మందులు కూడా ఇచ్చేవారు.

ప్రస్తుతం ఇలాంటి వైద్యసేవలు పశువులకు పూర్తిగా దూరమయ్యాయి. కూటమి ప్రభుత్వం పశువుల ప్రాణాలను గాల్లోకి నెట్టేస్తోంది. మూగజీవాలపై సైతం కక్ష సాధిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా 2022 మే నెలలో పశువులకు కూడా అంబులెన్స్ సౌకర్యం కల్పించారు. ఒక్కో నియోజకవర్గానికి రెండు చొప్పున మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లు కేటాయించారు. జిల్లాకు మొత్తం 16 సంచార అంబులెన్సులు ఇచ్చారు. వాటి కోసం సంప్రదించేందుకు 1962 ఫోన్ నంబర్‌ను కేటాయించారు. వీటి నిర్వహణ బాధ్యతలను జీవీకే ఈఎంఆర్‌ఐ సంస్థకు అప్పగించారు. ప్రతి అంబులెన్స్‌లో ఒక డాక్టర్, పారా మెడికల్ స్టాఫ్, అటెండర్ ఉంటారు. గేదెలకు ఎలాంటి వైద్యం అవసరమైనా అంబులెన్స్‌తో అక్కడికే వెళ్లి వైద్య సేవలు అందించేవారు. అంబులెన్స్‌లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నియోజకవర్గంలో పశువులకు ఎలాంటి వైద్యసేవలు అవసరమైనా మొబైల్ అంబులెన్స్ ద్వారా అందించారు.

ఆందోళనలో పశుపోషకులు...

మారుమూల గ్రామాల్లో గేదెలు, ఆవులు, ఎద్లకు ప్రమాదం జరిగి కాలు విరిగితే వాటిని పశువైద్యశాలలకు తీసుకెళ్లడం చాలా కష్టం. అలాంటి పశువులు, వాటి పోషకుల బాధను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూగజీవాల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఏకంగా మొబైల్ వెటర్నరీ అంబులెన్సులు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా మూడేళ్లుగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పశుపోషకులు తమ పశువులకు వైద్యం చేయించుకున్నారు. నేడు ఒక్కసారిగా అంబులెన్స్‌ల సేవలు నిలిచిపోవడంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా పశ్చిమ ప్రకాశంలో అధిక సంఖ్యలో రైతులు పాడి పరిశ్రమ ద్వారానే కుటుంబాలను పోషించుకుంటుంటారు. అంబులెన్స్‌ల ద్వారా పశువైద్యసేవలు నిలిచిపోవడంతో వారంతా అయోమయంలో ఉన్నారు. పశువులకు ఏదైనా ఇబ్బంది కలిగితే రూ.5 వేల నుంచి రూ.6 వేలకు వాహనాలను బాడుగకు మాట్లాడుకుని అష్టకష్టాలు పడి పశువులను వాటిలో ఎక్కించి ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌ల సేవలు కొనసాగించాలి



పశువులు, పశుపోషకుల కోసం మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లను కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. పశ్చిమ ప్రకాశంలో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ మీదనే ఎక్కువగా ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారు. మొబైల్ అంబులెన్స్‌ల సేవలు దూరమైతే చూడి గేదెలు, దూడల సంరక్షణ భారంగా మారుతుంది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని అంబులెన్స్‌లను కొనసాగించాలి.

\- జి.బాలనాగయ్య, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు, మార్కాపురం

జిల్లాలో ఉన్న తెల్లపశువులు సుమారు	56,332
నల్లపశువులు - సుమారు	6,71,812

పశ్చిమ ప్రకాశంలో పశువుల సంఖ్య

ఆవులు, ఎద్లు	35,456
గేదెలు	3,76,520
పాలిచ్చే గేదెలు	1,19,200

ప్రశ్నార్థకంగా ఉద్యోగుల భవిష్యత్తు...

మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లు నిలిచిపోవడంతో వాటిలో పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అంబులెన్స్‌లు వైద్యసేవలు అందించే కాల పరిమితి గత బుధవారంతో ముగిసింది. దీంతో మొదటి ఫేజ్‌లో జిల్లాకు పంపిన 8 అంబులెన్స్‌లను నియోజకవర్గ హెడ్‌క్వార్టర్‌లో ఉండే అసిస్టెంట్ డైరెక్టర్లకు ఉద్యోగులు అప్పగించారు. దీంతో వాటిలో పనిచేస్తున్న 8 మంది డాక్టర్లు, 8 మంది పారావిట్ సిబ్బంది, 8 మంది అటెండర్లు, డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం వస్తే రెగ్యులర్ అవుతామని ఆశించిన సిబ్బందికి ఉన్న ఉద్యోగాలు ఊడబీకడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.


గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లు

గ్రామ సమస్యలపై పోలీసుల పల్లె నిద్ర

ఒంగోలు టౌన్: జిల్లాలోని గ్రామాల్లో సమస్యలపై ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యల పరిష్కారంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చట్టాలపై అవగాహన పెంపొందించడం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తం చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీసులతో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులు గ్రామాల్లో నిద్రించి ప్రజలతో మమేకమయ్యారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే చట్టపరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ఆరా తీశారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. వాటి బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కొత్త ఫోన్ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను తొందరపడి లిఫ్ట్ చేయవద్దని, ఆఫర్ల గురించి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని చెప్పారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణ నష్టం జరుగుతోందని వివరించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో ఇంటి వద్ద తమ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అతి వేగం ప్రమాదకరమని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి, గుట్కాలు వినియోగించవద్దని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని తెలిపారు.

అగ్నికి ఆహుతై మహిళ మృతి


మంచం కాలిపోయి కింద పడి ఉన్న ప్రేమమ్మ మృతదేహం


మృతురాలు ప్రేమమ్మ (ఫైల్)

- మృతిపై అనుమానాలు
- వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పామూరు: అనుమానాస్పదస్థితిలో అగ్నికి ఆహుతై మహిళ మృతిచెందిన ఘటన పామూరు మండలంలోని వగ్గంపల్లె ఎస్సీకాలనీలో శనివారం వేకువజామున వెలుగుచూసింది. స్థానిక ఎస్సై టి.కిషోర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వగ్గంపల్లె ఎస్సీకాలనీకి చెందిన పూనూరి ప్రేమమ్మ (55) వారి పశువుల షెడ్ వెనుకవైపు వసారాలో మంచంమీద పడుకుని శుక్రవారం రాత్రి నిద్రించింది. ఆమె కుమారుడు, కోడలు, కుటుంబ సభ్యులు పక్కనే ఇంట్లో పడుకున్నారు. శనివారం వేకువజామున సుమారు 3 గంటల సమయంలో ప్రేమమ్మ కుమారుడు జాన్ మూత్ర విసర్జనకు బయటకురాగా, పక్కనున్న పశువుల షెడ్ వెనుకవైపు వసారాలో మంటలున్నట్లు వెలుగు కనిపించింది. దీంతో అతను వెళ్లి చూడగా, మంచంమీద ఉన్న ప్రేమమ్మ కాలిపోయి ఉంది. అతను పెద్దగా కేకలు వేసి మంటలను ఆర్పివేశాడు. అప్పటికే ప్రేమమ్మ మృతి చెందింది. ఆ మేరకు పోలీసులకు సమాచారం అందించి జాన్ ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలాన్ని సీఐ ఎం.భీమానాయక్, ఎస్సై టి.కిషోర్ బాబు పరిశీలించి విచారణ చేపట్టారు. ప్రస్తుతానికి ఎటువంటి ఆధారాలు లేవని, ప్రేమమ్మ పూర్తిగా కాలిపోయిందని, పోస్టుమార్టం నివేదిక వచ్చాకే ఏవైనా వివరాలు తెలిసే అవకాశం ఉందని సీఐ, ఎస్సై తెలిపారు. కొన్ని రోజులుగా ప్రేమమ్మ తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు సమాచారం. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

శివరాత్రికి 50 ప్రత్యేక బస్సులు

- ప్రతి మండల కేంద్రం నుంచి కోటప్పకొండకు నేరుగా బస్సులు
- డీపీటీవో సుధాకర్

ఒంగోలు టౌన్: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రమైన ఒంగోలు ఆర్టీసీ డిపో నుంచి 50 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి డి.సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. ఒంగోలు నుంచి కోటప్పకొండకు 45 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రం నుంచి భక్తులు నేరుగా కోటప్పకొండకు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి మండల కేంద్రంలోను ఒక ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ప్రస్తుతం ఒంగోలు నుంచి శ్రీ శైలానికి 10 బస్సు సర్వీసులు నడుస్తున్నాయని, అదనంగా మరో 5 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ఈనెల 26 వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు తిరుగుతాయని చెప్పారు. అలాగే సోమవారం నుంచి విజయవాడకు ఇంద్ర ఏసీ బస్సు నాన్ స్టాప్ సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి 45 నిముషాలకు ఒక ఇంద్ర ఏసీ బస్సులు ఉంటాయన్నారు. పామూరుకు మూడు ఎక్స్ ప్రెస్ బస్సులను నడపనున్నట్లు తెలిపారు.

సిడాప్ ద్వారా జాబ్‌మేళాలు

ఒంగోలు వన్‌టౌన్: సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ద్వారా ఈనెల 28, మార్చి 4, 14, 18, 28వ తేదీల్లో జిల్లాలో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఒంగోలు కార్యనిర్వాహక సంచాలకులు కే ధనలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మైనార్టీ వర్గాలు ముస్లిం, క్రైస్తవ, సిఖ్, బౌద్ధ, జైనులు తమ అర్హతలను బట్టి సిడాప్ వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, ఒంగోలు వారిని గానీ లేదా, మైనారిటీ కార్పొరేషన్ ఒంగోలు కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి


మృతుడు వెంకటేశ్వర్లు (ఫైల్)

దర్శి (కురిచేడు): ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన దర్శి మండలంలోని లంకోజనపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాయవరపు వెంకటేశ్వర్లు (37) తమ ఇంటి ముందున్న పాడుపడిన బావి గట్టు ఎక్కి చిక్కుడుకాయలు కోస్తున్నాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. ఎంతసేపటికీ వెంకటేశ్వర్లు ఇంట్లోకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఎక్కడా కనిపించకపోగా, ఇంటి ముందున్న బావి వద్ద వెంకటేశ్వర్లు చెప్పులు కనిపించడంతో బావిలో చూశారు. వెంకటేశ్వర్లు అప్పటికే మృతిచెంది ఉండటంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు.

భార్య తిట్టిందని చేపల చెరువులో దూకిన భర్త

- కాపాడిన కానిస్టేబుల్


లక్ష్మయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ ఖాశీం

కురిచేడు: భార్య తిట్టిందని మనస్తాపం చెందిన భర్త చేపల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోబోగా, కానిస్టేబుల్ ఖాశీం కాపాడారు. ఈ సంఘటన కురిచేడు మండలంలోని ముష్టగంగవరం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. త్రిపురాంతకం మండలం వెంగాయపాలెం గ్రామానికి చెందిన కొండారి చిన్న లక్ష్మయ్య భార్యతో గొడవపడి మనస్తాపం చెంది చనిపోవాలనే ఉద్దేశంతో మధ్యాహ్న సమయంలో మండలంలోని ముష్టగంగవరం గ్రామ సమీపంలోని బలరాం క్యాంపులో గల చేపల చెరువులో దూకాడు. అయితే, చేపల చెరువు లోపల ఒక ఎత్తైన గట్టు మీద నిలబడి బయటకు రాకుండా నీటిలోనే ఉండగా, చుట్టుపక్కల వారు చూసి బయటకు రమ్మని బతిమాలారు. అయినప్పటికీ బయటకు రాకపోవటంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు కానిస్టేబుల్ షేక్ ఖాశీం సంఘటన స్థలానికి చేరుకుని చేపల చెరువులో ఉన్న వ్యక్తిని చాకచక్యంగా కాపాడి బయటకు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో ఖాశీంను అక్కడున్న వారు అభినందించారు.

బెట్టింగ్‌ల నేపథ్యంలో యువకుడు అదృశ్యం


బత్తిన అశోక్ (ఫైల్)

జరుగుమల్లి (సింగరాయకొండ): బార్బర్ షాప్‌నకు వెళ్లి వస్తానంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఆ వివరాల ప్రకారం.. జరుగుమల్లి మండలంలోని పైడిపాడు గ్రామానికి చెందిన బత్తిన అశోక్ (30) గురువారం ఉదయం వెళ్లి తిరిగి రాకపోవడంతో శుక్రవారం రాత్రి జరుగుమల్లి పోలీస్ స్టేషన్లో తల్లి లక్ష్మీకాంతం ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అశోక్ మోటార్ సైకిల్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఫోన్ స్విచాఫ్ వస్తోందని ఫిర్యాదులో తెలిపింది. అశోక్ ఫోన్ నంబర్‌ను ఎస్సై బి.మహేంద్ర ట్రేస్ చేయగా, పొన్నలూరు మండలం రావులకొల్లు సమీపంలోని గ్రామం వద్ద ట్రేస్ అయిన అనంతరం స్విచాఫ్ వచ్చింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు. అశోక్‌కు బెట్టింగ్‌కు పాల్పడే అలవాటు ఉందని, చివరిగా అతను తన్నీరు తేజకు ఫోన్ చేసినట్లు తెలుస్తోందని, బెట్టింగ్ బుకీలతో అతనికి ప్రాణ హాని ఉండే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సోదరుడే కసాయిగా మారి..సోదరిని గర్భవతిని చేసి..!

కొండపి: సోదరుడే కసాయిగా మారి సోదరిని గర్భవతిని చేసిన సంఘటన కొండపి మండలం పెట్లూరు గ్రామంలో వెలుగుచూసింది. మానవీయ విలువలను, రక్తసంబంధాలను మంట కలిపిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. పెట్లూరు గ్రామానికి చెందిన భార్యభర్తలు కొన్ని సంవత్సరాల క్రితమే విడిపోయారు. అప్పటికే వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విడిపోయిన అనంతరం ఆడపిల్లలు తల్లి సంరక్షణలో ఉండగా, కొడుకు తండ్రి సంరక్షణలో పెరిగాడు. తండ్రీకొడుకులు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేస్తుండగా, తల్లి విజయవాడలో కూలి పనులు చేసుకుంటూ తన ఇద్దరు ఆడపిల్లలను సంరక్షించుకుంటోంది. ఈ క్రమంలో గత సంవత్సరం క్రిస్మస్ పండుగ సందర్భంగా స్వగ్రామానికి తండ్రీకొడుకులు వచ్చారు. ఆ సమయంలో విజయవాడలో ఉంటున్న తన తల్లి వద్దకు కొడుకు వెళ్లాడు. ఆమె పెద్ద కూతురు అయిన తన పెద్ద చెల్లిని తనతో పాటు పెట్లూరు పంపించాలని, పండుగ తర్వాత హైదరాబాద్ వెళ్లేటప్పుడు విజయవాడలో వదిలివెళ్తానని చెప్పాడు. అన్న, తండ్రి వద్దకే కదా అనే ఉద్దేశంతో ఆమె పంపించగా, పండుగ తర్వాత విజయవాడలో తల్లి వద్ద వదిలిపెట్టకుండా తమతో పాటు హైదరాబాద్ తీసుకెళ్లారు. తన కుమార్తెను పంపించాలని తల్లి కోరినప్పటికీ.. తండ్రీకొడుకుల వద్ద నుంచి ఎటువంటి సమాధానం లేదు. చివరకు కొన్ని రోజుల తర్వాత తల్లి వద్దకు కుమార్తె చేరుకుంది. ఈ క్రమంలో కూతురు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా, గర్భవతి అని తెలిసి ఆ తల్లి దిగ్భ్రాంతికి గురైంది. కూతురును నిలదీయగా తన అన్న తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. ఆగ్రహించిన ఆ తల్లి పెట్లూరు గ్రామానికి వచ్చి స్థానిక పెద్దల సహకారంతో కొండపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పోక్సో కేసు నమోదు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు స్థానిక ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీలు శిక్షణను ఉపయోగించుకోవాలి

- ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్


అంగన్‌వాడీ వర్కర్లు తయారు చేసిన చార్టులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీఓ ఇవాంజెలిన్

మద్దిపాడు: అంగన్‌వాడీ వర్కర్లు శిక్షణను ఉపయోగించుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (ఐసీడీఎస్ పీడీ) హేనా సుజన్ పిలుపునిచ్చారు. మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వాటిని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఆదేశించారు. విద్యార్థుల మానసిక ఎదుగుదలకు దోహదపడే విధంగా అభ్యసన ప్రక్రియ సాగించాలని తెలిపారు. ట్రైనింగ్‌లో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు గ్రూపులుగా మారి పలు రకాల చార్టులు తయారుచేయగా, వాటిని పీడీ పరిశీలించారు. ఇదే స్ఫూర్తితో అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా చార్టులు తయారు చేసి ప్రదర్శించాలని సూచించారు. చార్టుల తయారీలో ప్రతిభ చూపిన అంగన్‌వాడీ వర్కర్లను అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని 0 నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఇప్పించి ఆధార్ ఎన్‌రోల్‌ను నూరు శాతం చేయించాలని అంగన్‌వాడీలను ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఇవాంజెలిన్, ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు, డీఆర్పీలు ఉష శేషారెడ్డి, రామారావు, శ్రీనివాసరావు, జి.పద్మావతి, కె.శ్రీదేవి, మద్దిపాడు హైస్కూల్ హెచ్ఎం కోటిరెడ్డి, గుండ్లాపల్లి హైస్కూల్ హెచ్ఎం ప్రభాకర్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.